క్లుప్తంగా

పథకాలను ప్రజలకు చేరువ చేయాలి



కొత్త వలంటీర్లతో జెడ్పీ చైర్మన్ శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో వలంటీర్లు బాధ్యతగా పనిచేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్ సూచించారు. పాలకొల్లు మండలంలోని ఖాళీగా ఉన్న వలంటీర్ల స్థానంలో నియమితులైన వారికి సోమవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన నియామక పత్రాలు అందజేశారు. ఎంపీడీఓ సంగాని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

నరసాపురం: స్థానిక 28వ వార్డులో రూ.48 లక్షలతో నిర్మించనున్న సీసీ డ్రెయిన్, రూ.5 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ముఖ్యఅతిథిగా పాల్గొనగా మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని శంకుస్థాపన చేశారు. రాష్ట్ర కనీసవేతనాల సలహామండలి చైర్మన్ బర్రి లీల, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ముదునూరిని కలిసిన శివకుమార్



ముదునూరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న శివకుమార్

నరసాపురం: వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీసెల్ కన్వీనర్‌గా నియమితులైన కావాడి శివకుమార్ సోమవారం ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజును ఆయన నివాసం వద్ద కలిశారు. ముదునూరి మాట్లాడుతూ పార్టీ అప్పగించిన బాధ్యతలు విజయవంతంతగా నిర్వహించాలని శివకుమార్‌కు సూచించారు.

పాఠశాలకు గ్లాసుల వితరణ

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేయడం అభినందనీయమని నిట్టల శైలజ అన్నారు. సోమవారం స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రాగి జావ నిమిత్తం 100 స్టీల్ గ్లాసులు, స్పూన్లను బహూకరించారు. ప్రధానోపాధ్యాయుడు రాయపూడి భవానీప్రసాద్ పాల్గొన్నారు.

మేకలు, గొర్రెలకు మందులు

యలమంచిలి: పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా వ్యాక్సిన్లు వేస్తున్న పశు వైద్యులు, మేకలు, గొర్రెలకు కూడా వేసవి తాపానికి అల్లాడకుండా బలం మందులు, టానిక్‌లు అందిస్తున్నారు. కనకాయలంక గ్రామంలో సోమవారం వైస్ ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ మద్దా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దొడ్డిపట్ల పశువైద్య కేంద్ర వైద్యాధికారి పోరెడ్డి చంద్రశేకరరెడ్డి ఈ మందులను మేకలు, గొర్రెలు పెంపక రైతులకు అందించారు. గోపాలమిత్ర వలవల బాలాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు తహసీల్దార్‌గా పెద్దిరాజు

పాలకొల్లు సెంట్రల్/పాలకొల్లు అర్బన్: పాలకొల్లు తహసీల్దార్‌గా సీహెచ్ పెద్దిరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో కేఆర్ఆర్‌సీ (కోనేరు రంగారావు సొసైటీ)లో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తూ పదోన్నతిపై పాలకొల్లు వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జి తహసీల్దార్ కె.నాగదేవి నుంచి పెద్దిరాజు బాధ్యతలు స్వీకరించారు. నాగదేవి, ఆర్ఐ త్రిమూర్తులు, సర్వేయర్ రామభద్రరాజు పెద్దిరాజుకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

హెల్మెట్‌తో ప్రాణ రక్షణ

పోడూరు: హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలకు రక్షణగా ఉంటుందని ఎస్సై డి.రామ్‌కుమార్ అన్నారు. పెనుమదంలో ఆయన సోమవారం హెల్మెట్ డ్రైవ్ కార్యక్రమంలో ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు.

అధ్యాపకురాలు విక్టోరియాకు డాక్టరేట్

నరసాపురం రూరల్: సీతారాంపురం స్వర్ణాంధ్ర కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఈతకోట మేరి విక్టోరియాకి డాక్టరేట్ లభించింది. ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి చెందిన డాక్టర్ కె.గంగాధర్ ఆధ్వర్యంలో ఫినైట్ ఎలిమెంట్ ఎనాలిసిస్ ద్వారా హైబ్రీడ్ నానో ఫ్లూయిడ్స్ ఉష్ణ గ్రాహక చర్యలు ఎలా ఉంటాయనే విషయం పై పరిశోధన చేశానని విక్టోరియా తెలిపారు. విక్టోరియాను కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్, కళాశాల చైర్మన్ కేవీ స్వతనారాయణ, పాలకవర్గ సభ్యులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం

- నవరత్నాలతో పేదల జీవితాల్లో మార్పు
- ఆసరాతో మహిళల్లో ఆర్థికాభివృద్ధి
- ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు



నమూనా వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు



కార్యక్రమానికి హాజరైన డ్వాక్రా మహిళలు

నరసాపురం: ప్రజలను పేదరికం నుంచి బయటకు తీసుకురావడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం నరసాపురం మున్సిపాలిటీలో 16 నుంచి 31 వరకు ఉన్న వార్డులకు సంబంధించి ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముదునూరి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. డ్వాక్రా మహిళలకు అనేక రూపాల్లో చేయూత ఇచ్చి వారిని ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చెప్పారు. భవిష్యత్‌లో డ్వాక్రా సంఘాల మహిళలు పెద్దపెద్ద కంపెనీలతో వ్యాపార లావాదేవీలు సాగించే స్థితికి తీసుకొచ్చే ప్రయత్నం సీఎం చేస్తున్నారని వివరించారు. మహిళాభ్యుదయం, మహిళా సంక్షేమం వంటి అంశాలను మాటలకే పరిమితం చేయకుండా ముఖ్యమంత్రి జగన్ ముందుకెళుతున్నారని తెలిపారు. ఆసరా, చేయూత, సున్నావడ్డీ రుణాలు వంటి కార్యక్రమాలతో మహిళలకు అండగా ప్రభుత్వం నిలబడిందని చెప్పారు. ఆర్థికంగా నిదొక్కుకున్నప్పుడే మహిళల్లో ఆత్మస్థైర్యం నిండుతుందని జగన్ బలంగా నమ్మి ముందుకెళుతున్నారని తెలిపారు.

ఆదర్శంగా పొదుపు సంఘాలు

పేదలను ఆదుకునేందుకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసే క్రమంలో కొంతమేర అప్పులు తీసుకొస్తుంటే ప్రతిపక్ష పార్టీలు రాద్ధాంతం చేస్తున్నాయని ముదునూరి ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో మాదిరిగా అప్పులు తెచ్చి సొంత ఖాతాల్లో జగన్ వేసుకోవడంలేదని చెప్పారు. తీసుకొచ్చిన అప్పులు పేదలకే పంచుతున్నారని వివరించారు. గత టీడీపీ ప్రభుత్వం కంటే మెరుగైన విధానాలను తీసుకొచ్చి పొదుపు సంఘాలను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దారని తెలిపారు. ఇతరులపై ఆధారపడకుండా మహిళలు స్వశక్తితో జీవించేలా చేయడమే ఆసరా పథకం లక్ష్యమన్నారు. నరసాపురం పట్టణంలోని 31 వార్డుల్లో 634 డ్వాక్రా గ్రూపులకు మూడో విడత రూ 5.61 కోట్లు జమ చేశామని చెప్పారు. పట్టణంలో మూడు విడతలకు కలిపి ఈ 634 గ్రూపులకు ఒక్క నరసాపురం టౌన్‌లోనే రూ.16.82 కోట్లు జమయిందని వివరించారు. నరసాపురం నియోజకవర్గంలో ఈ నాలుగేళ్లలో ఆసరా పథకం ద్వారా రూ.180 కోట్లు జమచేసినట్టు చెప్పారు. ప్రభుత్వ సహకారాన్ని డ్వాక్రా మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న, రాష్ట్ర కనీసవేతనాల సలహా మండలి చైర్‌పర్సన్ బర్రి లీల, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, కౌన్సిలర్లు వైకేఎస్, కావలి రామసీత, అడిదల శ్యామల, కేసరి గంగరాజు, జిల్లెళ్ల దిలీప్, గొల్ల జయరాజ్‌సింగ్, సిర్రా కాంతమ్మ, యర్రా శ్రీను, చిట్టూరి కృష్ణ, ద్వారా గంగాభవాని, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బూసరపు జయ, చదలవాడ మెర్లిన్, బర్రి శంకర్, గోరు సత్తిబాబు, పోలిశెట్టి గోపీనాథ్, అడిదల శరత్, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

పాలకొల్లు అర్బన్: విద్య, వైద్య రంగాలతో పాటు సామాజిక రంగాలకు వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు అందిస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు తటవర్తి కృష్ణమూర్తి అన్నారు. పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో సోమవారం 40 మంది గర్భిణులకు వెంకట్రామరాజు విరాళంతో పౌష్టికాహారం అందజేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ జి.ప్రభాకరరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయకుమారి, పట్టణ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సూర్యనారాయణరాజు, ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు తదితరులు పాల్గొన్నారు.

559 మంది విద్యార్థుల హాజరు

పోడూరు: మండలంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన 10వ తరగతి పబ్లిక్ పరీక్ష 559 మంది విద్యార్థులు రాశారని, ఏడుగురు గైర్హాజరయ్యారని ఎంఈఓ ప్రేమజ్యోతి తెలిపారు.

ఘనంగా హానిమన్ జయంతి

నరసాపురం: హోమియో పితామహుడు డాక్టర్ శామ్యూల్ హానిమన్ జయంతిని జిల్లా రిజిష్టర్డ్ హోమియో వైద్యుల సంఘం ఆధ్వర్యంలో సోమ వారం ఘనంగా నిర్వహించారు. టేలర్ హైస్కూల్ సమీపంలో ఉన్న హానిమన్ విగ్రహానికి పూలమాల లు వేసి నివాళులర్పించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు శిరిగినీడి రమేష్, రాజ్యలక్ష్మి మాట్లాడారు.

అడుగడుగునా నీరాజనం



ఆచంటలో ఓ ఇంటి వద్ద మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్ అతికించిన మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



చింతపర్రులో ప్రజాభిప్రాయం తెలుసుకుంటున్న జెడ్పీచైర్మన్ కవురు శ్రీనివాస్



కవిటం గ్రామంలో మా నమ్మకం నీవే జగన్ కార్యక్రమంలో లబ్ధిదారుకు బ్రోచర్ అందిస్తున్న నాయకులు



యలమంచిలిలో ఇంటి గోడకు స్టికర్ అతికిస్తున్న ఎంపీపీ రావూరి వెంకటరమణ



పితానిమెరకలో మా నమ్మకం నువ్వే జగన్ అంటున్న గ్రామస్తులు, కార్యకర్తలు



పేరుపాలెం సౌత్‌లో సంక్షేమ పథకాలను వివరిస్తున్న నాయకులు

- మా నమ్మకం నువ్వే జగన్‌కు గ్రామాల్లో విశేష స్పందన
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీరంగనాథరాజు

పెనుగొండ: జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్‌కు గ్రామాల్లో అడుగడుగునా నీరాజనం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు పలుకుతున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. నాలుగో రోజు సోమవారం ఆచంట మండలం ఆచంట పారలో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజాభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్ల కాలంలో సంక్షేమాన్ని రూ.2 లక్షల కోట్లకుపైగా ఖర్చు చేయడంతో ప్రతి గడపగడపకూ ధైర్యంగా వెళ్లి వారికి అందించిన సంక్షేమాన్ని వివరించగలిగామని చెప్పారు. జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ ప్రజల గుండెల్లోంచి వచ్చిన కార్యక్రమం అన్నారు. కార్యక్రమానికి ఎనలేని స్పందన వస్తుందన్నారు. పాలనపై ప్రతి ఇంటికీ వెళ్లి కన్వీనర్లు, గృహసారథులు పరిశీలన చేసి, వారికి మరింత సంక్షేమాన్ని అమలు చేయనున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు అందుకొన్న సంక్షేమంతో పేదలు అందరూ సీఎం జగన్‌కు అండగానే నిలుస్తున్నారన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రీ చేయని సాహసాన్ని సీఎం జగన్ చేస్తున్నారని కొనియాడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఆచంట సర్పచ్ కోట సరోజనీ వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్‌కుమార్, పార్టీ నాయకులు పెచ్చెట్టి సత్యనారాయణ, తప్పెట్ల విజయకుమార్, ఉల్లం రామానుజం, నెక్కంటి రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

మేమంతా జగన్ వెంటే..

పెనుగొండ, ఆచంట మండలాల్లో సోమవారం జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. మేమంతా జగన్‌వెంటే అంటూ ప్రజలు నీరాజనం పలుకుతున్నారు. ఇలపర్రులో మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు దండు పద్మావతి, ఎంపీటీసీ పడపట్ల పద్మ నాగేశ్వరి, సొసైటీ అధ్యక్షుడు వేండ్ర వెంకటేశ్వర్లు, మండల ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరరావు, కన్వీనర్లు వేగిరాజు శ్రీనివాసరాజు, పీతల మందులు, సాదే గోపాలం, దిడ్ల శ్రీను, మల్లిపూడి లలిత, పీతల ప్రభాకర్ పాల్గొన్నారు, సిద్ధాంతం, తామరాడ, కొఠాలపర్రు, దేవ, చినమల్లం, ఆచంట మండలం కొడమంచిలి, ఆచంట, వల్లూరు, ఆచంట వేమవరం, కోడేరు, పెనుమంచిలిల్లోనూ మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

పాలకొల్లు అర్బన్: నవరత్నాల పథకాల అమలు ద్వారా ఆర్థిక ప్రయోజనం కల్పించి పేదరికం రూపుమాపడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్ అన్నారు. జగనన్న మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం పాలకొల్లు మండలంల శివదేవునిచిక్కాల, చింతపర్రు, పాలకొల్లు పట్టణంలోని 3వ వార్డులోని శ్రీరామపేట, కోడిగట్టు తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. సీఎం జగన్ ఈ నాలుగేళ్ల పాలనలో ఒక్కొక్క కుటుంబానికి రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు ఆర్థిక ప్రయోజనం కల్పించారని చెప్పారు. అర్హత ఉండి పథకాలు అందని వారి వివరాలను తెలియజేస్తే ఈ నెలాఖరు నాటికి వారికి కూడా ఆర్థిక ప్రయోజనం కల్పిస్తామని హామీ ఇచ్చారు. లబ్ధిదారులు జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, చింతలపూడి పార్టీ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, మండల పరిషత్ మాజీ ప్రతిపక్షనేత చిట్టూరి ఏడుకొండలు, కోఆప్షన్ మెంబర్ తండా ఇస్సాక్‌రాజు, మండల, పట్టణ గృహ సారథుల కన్వీనర్లు పార్శి వెంకటరత్నం, ఎంఎస్ వాసు, మండల కన్వీనర్ ఎం.మైఖేల్‌రాజు, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు గుమ్మాపు పెద్దిరాజు, మూడో వార్డు ఇన్‌చార్జి మోర్త గిరీష్ పాల్గన్నారు.

గ్రామాల్లో ఉత్సాహంగా..

పోడూరు: మండలంలో సోమవారం మా నమ్మకం నీవే జగన్ కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. కవిటంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, కవిటం, మినిమించిలిపాడు, గుమ్మలూరు గ్రామాల్లో సర్పంచ్‌లు చుట్టుగుళ్ల పూర్ణిమ, రామన వీర్రాజు, గొట్టుముక్కల సోనియా రమేష్, గ్రామకమిటీ అధ్యక్షులు అంబళ్ల భాస్కరరావు, పాతగొలుసు రాముడు, నాగరాజు బాలాజీవర్మ, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పడాల వెంకట సత్యనారాయణరెడ్డి (అబ్బు), గుమ్మలూరు ఎంపీటీసీ-2 అంబటి సుధాకర్, బొక్కా వెంకటకృష్ణ, నేలపూడి సురేష్, కుడిపూడి నాగరాజు, తానేటి సురేష్, వీరవల్లి దుర్గారావు, పోతంశెట్టి సూర్యనారాయణరెడ్డి, తరపట్ల మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలిలో..

యలమంచిలి: మండలంలోని 32 గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. యలమంచిలిలో ఎంపీపీ రావూరి వెంకట రమణ, స్థానిక సొసైటీ అధ్యక్షుడు చివటపు నాగేశ్వరరావులు సోమవారం గ్రామంలో ఇళ్లకు వెళ్లి ప్రజాభిప్రాయం సేకరించారు.

మొగల్తూరు మండలంలో..

మొగల్తూరు: జగనన్నే మా భవిష్యత్, మానమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని 21 సచివాలయాల పరిధిలో పథకాల అమలుపై ఆరా తీశారు. సమస్యలు ఏమైనా ఉంటే గృహసారథుల దృష్టికి తీసుకురావాలని నాయకులు కోరారు.

జగనన్నే మా భవిష్యత్తుకు విశేష స్పందన

నరసాపురం రూరల్: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొంగ మురళీకృష్ణ అన్నారు. రాష్ట్ర చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ఆధ్వర్యంలో సోమవారం చిట్టవరం, సరిపల్లి, లక్ష్మణేశ్వరం, యర్రంశెట్టిపాలెం తదితర గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. పితాని మెరక గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పితాని సత్యనారాయణ, చవ్వాకుల నాగేశ్వరరావు, పాము లక్ష్మీకాంతం, గుబ్బల వెంకటేశ్వరరావు, గంగిడెడ్డి సునీతకిరణ్, ఆకన అమ్మాజీ, మట్టపర్తి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అండగా సీఎం జగన్



మార్టేరులో బ్రోచర్స్ అందజేస్తున్న జెడ్పీటీసీ కర్రి గౌరీ సుభాషిణి, సర్పంచ్ మట్టా కుమారి

పెనుమంత్ర: మహిళలకు అండగా నిలిచిన ప్రభుత్వం జగనన్నదేనని జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీసుభాషిణి అన్నారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం సోమవారం మార్టేరులో ప్రారంభించిన ఆమె ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు బ్రోచర్స్ పంపిణీ చేశారు. వారికి అందిన పథకాల లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. మార్టేరు, నెగ్గిపూడి గ్రామాల్లో గృహసారథులు ఇంటింటికీ వెళ్లి బ్రోచర్స్ పంపిణీ చేస్తూ.. స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో సర్పంచ్ మట్టాకుమారి, ఉపసర్పంచ్ కర్రి వేణుబాబు, సత్తి చంద్రారెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు. నెగ్గిపూడిలో సర్పంచ్ మామిడిశెట్టి ధనలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు అల్లంభాస్కరరెడ్డి, ఉప సర్పంచ్ అల్లం బాల సాయిరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు పెనుగొండ లక్ష్మి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి అల్లంబులిరెడ్డి, పాలసత్తిరాజు, సత్తి విష్ణుకుమార్‌రెడ్డి, పెనుగొండ నరసింహమూర్తి, దొంగ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు అందించడంలోనూ నిర్లక్ష్యం



కోడిపందేల దిబ్బలో వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: పెనుగొండ కోడిపందేల దిబ్బకు తాగునీరు అందించడంలోనూ పంచాయతీ విఫలమైందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు విమర్శించారు. సోమవారం కోడి పందేల దిబ్బలో రూ.30 లక్షలతో నిర్మించే వాటర్ టాంకు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. పెనుగొండ కెనాల్ వద్ద బ్రిడ్జి వద్ద రూ.3 లక్షలతో నిర్మించిన మారేమ్మ గూడెం మెట్ల రహదారిని ప్రారంభించారు. కోడి పందేల దిబ్బలో తాగునీటి కోసం ఆ ప్రాంత వాసులు అడిగితే పంచాయతీ తరువాత చూద్దామంటూ వాయిదా వేసిందని, దీంతో తన సొంత ఖర్చుతో తాగునీటి సరఫర ప్రారంభించామని చెప్పారు. తాగునీరు అందకుండా చేసి మాజీ మంత్రి పనికిమాలిన విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఒక్క కోడి పందేల దిబ్బలోనే రూ.1.25 కోట్లుతో రహదారుల నిర్మాణం, రూ.15 లక్షలతో విద్యుత్ సదుపాయం కల్పించినట్టు చెప్పారు. పెనుగొండలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేశామని, దీనికి ప్రజలే సమాధానం చెబుతారని అన్నారు. వైస్ ఎంపీపీ తోలేటి శ్రీను, పంచాయతీ సభ్యులు పిల్లి చాముండేశ్వరరావు, పూతినీడి శ్రీను, వెలగల శ్రీనివాసరెడ్డి, ఆదిరెడ్డి సన్యాసిరావు, మండల కన్వీనర్లు నలిమిల్లి బాబిరెడ్డి, బాలం సత్తిరాజు, నాయకులు పోడూరి రామ య్య, గాజుల బులిపుల్లారావు, పలివెల శ్రీను, చెవ్వేటి రాజు, తిక్కిరెడ్డి పవన్, కుడిపూడి సుబ్రహ్మణ్యం, మద్దు శ్రీనివాసరావు, వేండ్ర లీలా వెంకటరమణలు పాల్గొన్నారు.

గరగాలమ్మ డ్రెయిన్ ప్రక్షాళనకు శ్రీకారం

వర్షాకాలంలో సిద్ధాంతం గ్రామ ముంపునకు కారణమవుతున్న గరగాలమ్మ డ్రెయిన్ ప్రక్షాళనకు సోమవారం మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు శ్రీకారం చుట్టారు. గడపగడపకు మన ప్రభుత్వంలో ప్రజల నుంచి వచ్చిన విన్నపంతో పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు చిన్నం ఏడుకొండలు, గుత్తుల సత్యవతి, సొసైటీ అధ్యక్షుడు బలువుకృష్ణమూర్తి, గ్రామ అధ్యక్షుడు జుత్తిగ దామోదర్, కంకిపాటి డేవిడ్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పేరుపాలెం సౌత్‌లో ఫ్యామిలీ డాక్టర్

మొగల్తూరు: మండలంలోని పేరుపాలెం సౌత్‌లోని వైఎస్సార్ ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. తూర్పుతాళ్లు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు రంజిత్ కుమార్ ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులను పరీక్షించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు.

అభివృద్ధి పనులు చేపట్టాలి



సమావేశమైన పెనుగొండ పంచాయతీ పాలకవర్గం

పెనుగొండ: పంచాయతీ సమావేశాల్లో ఆమోదించిన పనుల చేపట్టి సత్వరం అభివృద్ధికి పాటుపడాలని పెనుగొండ పంచాయతీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. సోమవారం పెనుగొండ పాలకవర్గ సమావేశంలో సర్పంచ్ నక్క శ్యామలాసోని అధ్యక్షత నిర్వహించారు. ప్రతి సమావేశంలోనూ అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపినా పనులు ప్రారంభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశాలు సమస్యాత్మకంగా మారుతుండడంతో వీడియో చిత్రీకరణ ఏర్పాటు చేయడంతో ప్రశాంతంగా సాగింది. చెరుకువాడ బ్రాహ్మణ సమాఖ్య కమ్యూనిటి భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని, పెనుగొండ బస్టాండ్‌లో సీసీఎల్ నిర్మాణం చేపట్టాలని వంటి మరో రెండు అంశాలను టెబుల్ ఎజెండాలోకి చేర్చాలని 12 మంది పంచాయతీ సభ్యులు టెబుల్ ఎజెండాగా ఇచ్చిన ఎటువంటి సమాధానం ఇవ్వకుండానే, తరువాత సమావేశంలో చూడవచ్చునంటూ వాయిదా వేశారు. దీంతో పాటు శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ ఆలయం వద్ద పంచాయతీ స్థలం వద్ద ఏర్పాటు చేసిన ఇనుప స్థంబాలపైనా సభ్యుల మధ్య వాగ్వివాదం నడిచింది. మందుబాబులు, ఇతర అకృత్యాలను నివారించేందుకే స్తంభాలను ఏర్పాటు చేశారంటూ కొందరు, మరికొందరు ఎజెండాలోకి తీసుకు రావాల్సిన అవసరం ఏమిటని మరికొందరు జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు పాటించాలంటూ మరికొందరు పట్టుబట్టడంతో వాయిదా వేశారు. మిగిలిన ఆక్రమణలు పరిశీలించి అన్నింటిపైనా చర్యలు తీసుకోవాలని మరికొందరు డిమాండ్ చేశారు. చివరకు కొన్ని తీర్మానాలకు ఆమోదం, మరికొన్ని తీర్మానాలను వాయిదా వేశారు.

సేవా కార్యక్రమాల్లో లయన్స్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా గవర్నర్ వీకే పంకజాక్షన్ విజిట్‌లో భాగంగా ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో 30 మంది పేద బ్రాహ్మణులకు బియ్యం బ్యాగ్‌లు అందజేశారు. ఉచిత డయాబెటిక్ క్యాంపు నిర్వహించారు. డీఎన్నార్ మహిళా కళాశాలలో శానిటరీ సేఫ్ కిన్ బర్నింగ్ మిషన్, మోటర్ పంప్ సెట్, సిమెంట్ బెంచ్, అంజలి మానశిక వికలాంగుల పాఠశాలలో పౌష్టికాహారం పంపిణీ, లయన్స్ నగర్ అంగన్‌వాడీ కేంద్రానికి ఫాల్స్ సీలింగ్ ఏర్పాటు, రైల్వేగేటు వద్ద ఉన్న సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో నర్సరీ క్లాస్‌కు కుర్చీలు, బొమ్మలు, ప్రభుత్వ ఆసుపత్రికి ఫైబర్ కుర్చీలు అందించారు. రాజవల్లి రాధారమణ లయన్స్ కంటి ఆసుపత్రిలో మొదటి, రెండో అంతస్తు పునఃనిర్మాణ పనులు ప్రారంభించారు. 30 స్పోర్ట్స్ కిట్స్, 30 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, పది మంది పేదలకు బియ్యం బస్తాలు, ఒకరికి కృత్రిమ అవయవాలు అందించారు. ఈ సందర్భంగా వికలాంగులకు సేవలిందిస్తున్న వేదాంతం సదాశివమూర్తి, ఎన్నో గ్రంథాలు రాసిన మాడభూషి కృష్ణప్రసాద్, సేవా కార్యక్రమాలు అందిస్తున్న అమ్మా చారిటబుల్ ట్రస్ట్ సభ్యుడు అంబటి సాయితేజలను గవర్నర్ పంకజాక్షన్ చేతులుమీదుగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ గవర్నర్ డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి, క్లబ్ అధ్యక్షుడు ముత్యాల సత్యనారాయణ, సెక్రటరీ చల్లా ఆదినారాయణ, ట్రెజరర్ మాఘం శ్రీనివాసరావు, ఎన్‌వీఎస్ఎస్ పాపారావు నాయుడు, కొమ్ముల మురళి, రేపాక ప్రవీణ్‌భాను, శ్రీకాకొల్లు కామేశ్వరరావు, అధికారి కృష్ణ, ఆర్ఎస్ఆర్ మూర్తి, అందే భానుప్రకాష్, పేర్ల రాము, కానూరి సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.